# మాయమైన మనీపర్సు

దిక్కుమాలిన బస్సు ఎంతకూ కదలటంలేదు. బస్సులో కూచుని చాలా సేపయిందేమో - అప్పుడే కాళ్ళు నెప్పి పెడుతున్నై. ముప్పావుగంట కిందట అడిగితే ఆ కండక్టరు - 'వెళ్లిపోతోంది. ఎక్కండి' అన్నాడు. వెళ్ళిపోతూన్న బస్సు ఎక్కే పద్ధతిలో ఛటాలున ఎక్కి - సీటులో కూచున్నాను. ఆ కూచోటం కూచోటం అదే కూచోటం!

''బస్సు సరిగా ఎన్ని గంటలకు బయల్దేరుతుందయ్యా?'' అన్నాను కండక్టరుతో మళ్ళీ.

''సరిగ్గా ఒంటిగంటకు!'' అన్నాడు. గడియారం చూశాను. రెండుగంటలకు పదినిమిషాలు తక్కువ!

''ఒంటిగంటా - రెండుగంటలా?''

''ఒంటిగంట సార్'' అన్నాడు! ''ఇంకా ఇప్పుడు పన్నెండేగా'' అనే ధోరణిలో. నాకు వళ్లుమండి, గడియారం చూపించాను.

''మీది ఫాస్టు. ఐనా పోదాంలెండి'' అని నన్ను ఓదార్చి నాలుగుసార్లు హారన్ మోగించాడు. ఆ దెబ్బతో ఆ ప్రాంతాల తిరుగుతున్న మరికొందరు ప్రయాణీకులు పరుగున వచ్చి కూచున్నారు.

రెండింటికి, మహోషోగ్గా కిళ్లీ నములుతూ డ్రైవరు వచ్చాడు. లోపల అంతా యమ లోకం లాగా వుంది. ''పొగ త్రాగరాదు'' అని పెద్దక్షరాలు కనిపిస్తున్నా - ప్రతివాడూ పొగత్రాగుతూనే వున్నాడు. న్యాయాన్ని ధిక్కరించేందుకు వెనకాడి, నేను తాగలేదు! ఐనా, గాలికూడా ఎక్కడికక్కడ స్తంభించిపోయింది.

రెండూ పది నిముషాలకు ఎల్లాగైతేనేం హారన్ మోతలతో స్టాండునుంచి బస్సు బయల్దేరింది. కొన్ని గజాలు నడిపించి, ఆపేసి, దిగి కూడా పోయాడు డ్రైవరు! నాకు

నా ఒక్కడికేకాదు - అందరికీ విసుగు, కోపాలూ లేచాయి. డ్రైవరునూ కండక్టరునూ కొందరు తిట్టుకున్నారు. నేనెవర్నీ తిట్టలేదు. నన్ను నేను తిట్టుకున్నాను. బస్సు ప్రయాణం వద్దని మావాడు పోరాడుతున్నా వినిపించుకోక ఎక్కినందుకు!

కాస్సేపటికి బస్సుప్రయాణం హాయిగానే వుందనిపించింది. మోతాదయిన పరుగూ, చల్లని గాలి, అటూ యిటూ చెట్లూ వాతావరణం అంతా చక్కగా వుంది. బస్సునిండా మనుషులు లేరు - సీట్లనిండా మాత్రం వున్నారు. నాపక్కనే ఒక ముసలాయన కళ్లజోడులోంచి ప్రకృతిని పరిశీలిస్తున్నాడు. వుండివుండి ఏదో 'తనతో' చెప్పుకుంటున్నాడు.

ఒక తూము గట్టుప్రక్క బస్సు ఆగింది. అక్కడేం వూరున్నట్టు లేదు – అటూ యిటూ పొలాలూ చెట్లూ తప్ప. పాతికేళ్ళ కుఱ్ఱాడు ఒకాయన అక్కడ బస్సు ఎక్కాడు. కూచోటానికి ఎక్కడా స్థలం లేదుకదా ఎక్కడ కూచుంటాడనిపించింది నాకు. కండక్టరు మమ్మల్ని సర్దుకోమన్నాడు. అందరమూ సర్దుకున్నట్టే అటూ యిటూ జరిగి మళ్ళీ అట్లాగే కూచున్నాము. 'మీకు తెలీద'న్నట్టు కండక్టరు మొహం పెట్టి, బీరువాలో పుస్తకాలు సర్దినట్టు మమ్మల్ని సర్ది, నాకూ ముసలాయనకూ మధ్యగా అతన్ని కూచోపెట్టాడు. మళ్ళీ సర్దుకున్నాము. అతనికి చోటు సరిపోయింది గాని - మాకు కష్టమైపోయింది. ఏం చేస్తాం? ఆ బస్సు మనది కాదు!

కండక్టరు 'రైట్' అన్నాడు. బస్సు బయలుదేరింది. పది నిముషాలు పోయాక ''ఎక్కడికి వెళ్తారండీ?'' అన్నాడు కండక్టరు ఆ పాతికేళ్ళ కుఱ్ఱాడితో. అతను ఏదో చెప్పాడు. కండక్టరు టికెట్టు చింపియిస్తూ, డబ్బుకోసం చెయ్యి చాపాడు. కుఱ్ఱాడు జేబులో చెయ్యి పెట్టాడు. వెంటనే పాంటు జేబులు తడిమాడు - మళ్ళీ పైజేబులు చూశాడు - పాంటు జేబులు చూశాడు - మొహం ఎఱ్ఱగా ఐపోయింది. 'పర్సు పర్సు' అని గోలచేశాడు. నేను సీటుకిందా పక్కనా చూశాను. ఎక్కడా లేదు. డ్రైవరు బ్రేకువేసి ఆపాడు. ''అక్కడే పడిపోయి వుంటుంది'' అన్నాడు కుఱ్ఱాడు ఆత్రుతగా బస్సు దిగుతూ.

''పర్సులో ఏమాత్రం వుంటుంది?'' అనడిగాడు ఒకాయన.

''నూటయాభై రూపాయలకు పైగా వుందండి.'' అన్నాడు కుర్రాడు గాభరాగా.

''ఆ తూము గట్టుమీద మీరు కూచున్నపుడు పర్సు వుందా?'' అని ప్రశ్న వేశాడు డిటెక్టివ్ నవల చదువుకుంటున్న ఒకాయన వెనక నుంచి.

''వుందండి'' అన్నాడు కుర్రాడు వెళ్ళబోతూ.

''పాపం'' అన్నది ఒక ఆడ గొంతు.

''త్వరగా వెళ్ళి చూడండి. ఎంత పనయిపోయిందండీ!'' అన్నాడు ఒక వ్యక్తి మొదటి సీటు నుంచి.

''పరుగెత్తండీ!'' అని గాభరా చేసింది వెంటనే ఒక మగ గొంతు. కుర్రాడు పరుగెత్తబోయాడు. ఇంతలో క్లీనరు కుర్రాడు ''మీరుండండి, నేను వెళ్తాను'' అంటూ పరుగెత్తాడు!

''చాలాదూరం వచ్చేశామేమో!'' అన్నాను నేను.

''మైలున్నర'' అన్నాడు డ్రైవరు బస్సుదిగి.

నేనూ కిందికి దిగాను. ఈ కుర్రాడు వెళ్లి ఎప్పటికొస్తాడోననిపించి అంతా దిగ సాగారు. మార్గమధ్యం. ఎటుచూసినా చెట్లూ పొలాలూ తప్ప ఇంకేమీ కనిపించటం లేదు. ఐతేనేం, కాస్త గాలి పీల్చుకుంటున్నాం – అనిపించింది. నెమ్మదిగా నడిచి వెళ్లి ఒక మైలురాతి మీద చతికిలపడి సిగరెట్టు ముట్టించాను.

పావుగంట గడిచింది. ఆ వెళ్ళిన కుర్రాడు ఇంకా రాలేదు. పర్సు పారేసుకున్న వ్యక్తి రోడ్డుమధ్యగా నించుని అటే చూస్తున్నాడు. నా పక్కనే కూచున్న ముసలాయన నాకు కొద్దిదూరంలో నించుని ''ఈయన ఎవడో మధ్య పర్సు పారేసుకుంటే, ఈ ప్రయాణీకులందర్నీ ఎందుకో ఈ కష్టపెట్టటం?'' అన్నాడు.

''ఆఁ'' అన్నాను తిరిగి. ఆయన వినిపించుకోలేదు. ఎటో చూస్తున్నాడు. అప్పుడర్థమయింది. ఆయన నాతో చెప్పలేదు – తనతోనే చెప్పుకున్నాడని!

నేను కాస్త పరిశీలనగా ఆలోచించ సాగాను. ఈ అబ్బాయి నిజంగా పర్సు పారేసుకున్నాడా? తమాషా...? తమాషానే ఐతే దానివల్ల అతనికేం లాభం... పైగా, పర్సుకోసం ఈయన పరుగెత్తబోతే ఆ క్లీనరు కుర్రాడు 'నేను వెళ్తాను' అని పరుగెత్తాడు. కొంపదీసి ఆ పర్సు తీసుకుని వాడు పారిపోతాడా యేమిటి?... లేకుంటే ఎక్కడో దాచేసి 'దొరకలేద'ని బొంకినా బొంకవచ్చు. నూటయాభై రూపాయలు ఎంత పనయినా చేయించవచ్చు! ఏమిటో అంతా అగమ్యగోచరంగా వుంది. ప్రయాణీకులు ఆడవాళ్లు తప్పించి అంతా కిందనే వున్నారు. రోడ్డుమీదే మూలమూలలా, చెట్లకిందా విశాలంగా కూచున్నారు. ఆ దృశ్యం చూసి ''చూడవయ్యా కండక్టరూ? ఇట్లా విశాలంగా స్వేచ్ఛగా గాలి పీలుస్తూ బతకాల్సిన ఈ మనుషులందర్నీ నువ్వు ఆ బస్సులో సర్దుకోమంటావు గదా ఏం న్యాయం,'' అని కండక్టరుతో అనాలనిపించింది నాకు. నాకు

మూడు గజాల దూరంలో చెట్టుకింద నించుని చదువుకుంటున్నాడు డిటెక్టివ్ నవలాయన. వున్నట్టుండి నాదగ్గర కొచ్చాడు.

''మిష్టర్ - ఇదంతా ఏదో మిష్టరీగా వుందికదూ?'' అన్నాడు. జేబులోకూడా ఇంకో డిటెక్టివ్ పుస్తకం వుంది!

''అవునవును. అట్లాగే వుంది'' అన్నాను.

''పుస్తకం చదవుతున్నా నన్నమాటే గాని అదే ఆలోచిస్తున్నాను - ఆ పర్సు ఎలా పోయిందా ఏమిటా అని. అతనికి దగ్గరగా వున్న వాళ్లల్లో ఎవరేనా కొట్టేసి వుంటారేమోనని నా అనుమానం. రైళ్ళలోలాగే బస్సుల్లోనూ దొంగలుంటారండీ!'' అన్నాడు కొంప మునిగిపోయినట్టు.

''రైలుపెట్టెలో 'దొంగలున్నారు జాగ్రత్త' అని రాస్తారు కాబట్టి అక్కడుంటారు. బస్సుల్లో రాయరు - అందుకని దొంగలుండరు,'' అన్నాను చిరాకుతో.

అతను ఆకాశం పగిలినట్టు, ఒకసారి నవ్వి, తమాయించుకుని - ''బాగా చెప్పారండీ'' అన్నాడు.

''ఆ జేబులోది ఏం పుస్తకం?'' అని అడిగాను.

''అబ్బే నేనింకా చదవలేదండీ'' అన్నాడు రెండు చేతులతోనూ జేబులు కప్పేసుకుంటూ ఏడుపు మొహం పెట్టి.

''నాకక్కర్లేదులెండి, ఏమిటా అని.''

''అదా - 'పది హత్యలూ - పాతికమంది హంతకులూ''

''అబ్బ'' అన్నాను.

''ఇది చూశారా - ఇది - ''కాఫీ తాగని కాంతారావు''. కాని - బాగా లాక్కొస్తున్నాడు సుమండీ - గొప్ప సస్పెన్సును...''

నేను మరి మాట్లాడలేదు.

ఇంతలో డ్రైవరు ఏవో కేకలు వేస్తున్నాడు.

''నువ్వెళ్ళి రారా, వీడు ఎంతకూ అంతు తేలడు!'' అన్నాడు కండక్టరుతో.

''సరి!'' అని కండక్టరూ బయల్దేరాడు.

నేను మరో సిగరెట్టు ముట్టించాను. క్లీనరూ, కండక్టరూ, తర్వాత డ్రైవరూ, అంతా ఒక్కొక్కరే పోతారాయేం చెప్మా! పర్సు పారేసుకున్న కుర్రాడు చాలాదూరంలో వున్నాడు.

అందరూ చిరాగ్గా వున్నట్టు కనిపిస్తున్నారు. అప్పటికప్పుడే చాలాసేపయి పోయింది బస్సు ఆగిపోయి. పాతికేళ్ళ కుర్రాడు నెమ్మదిగా బస్సుచుట్టూ తిరుగుతు న్నాడు. వెళ్లిన క్లీనరూ కండక్టరూ ఇద్దరూ తిరిగి రాలేదు. వస్తున్న జాడలూ లేవు. డిటెక్టివ్ పుస్తకాలాయాన చాలా దూరంలోవుండి, ఏదో పరిశోధిస్తున్నట్టున్నాడు. నాపక్క ముసలాయన రాళ్ళగుట్ట కిందగా కూచుని మాట్లాడుకుంటున్నాడు!

పర్సు పారేసుకున్న కుర్రాడు నా దగ్గరగా వచ్చాడు. మొహంలో ఆత్రుత ఇంకా ఎక్కువగా కనిపిస్తున్నది. గాభరా పడుతున్నట్టూ, విచార పడుతున్నట్టూ కనిపిస్తున్నాడు.

''పర్సులో నూటయాభైరూపాయలు కాక ఇంకేం లేవా?'' అన్నాను.

''కొంత చిల్లర వుందనుకోండి.''

''మీ పర్సు అక్కడే పడివుంటుందని నిర్ధారణగా చెప్పలేమేమో!'' అన్నాను. అతను మాట్లాడలేదు. అటూ ఇటూ చూడసాగాడు. కొంతమంది ప్రయాణీకులు అతనికేసి తీవ్రంగా చూస్తూ గొణుక్కోవటం నేను కనిపెట్టాను.

అతను నాకు దగ్గరగా వచ్చాడు.

''అయ్యా - మీరు అర్థం చేసుకోగలరు. ఒక్క విషయం చెబుతాను. మన్నించండి!'' అన్నాడు.

''ఏమిటి!'' అన్నాను ఆశ్చర్యంగా.

''నేను పర్సు సరిగా చూసుకోలేదండీ, అది నా పాంటు వెనక జేబులో వుండిపోయింది'' అని నెమ్మదిగా పర్సు తీసి చూపించి మళ్ళీ ఎవరూ చూడకుండా పాంటు వెనక జేబులోనే పెట్టేశాడు.

''వాళ్ళు వెళ్ళాక ఇందాక మళ్లీ చూసుకుంటే వెనక జేబులో తగిలింది. నాగుండె ఆగిపోయినంత పనయింది. అన్ని జేబులూ వెతికాను గాని అది వెతకలేదు. ఆమాట చెప్పటానికి నాకు భయంగా ఉంది. ఇప్పుడు వీళ్ళల్లో కొందరన్నా నామీద జాలిగా వున్నారు. ఈ సంగతి చెబుతే అంతా నామీద ఎగిరిపడతారు. నానుంచి సుమారు ముప్పావుగంట ఇక్కడ ఆలస్యమైపోయింది. కండక్టరూ, క్లీనరు పాపం - పరుగెత్తి

వెళ్ళారు. ఇప్పుడేం చెయ్యటమో నాకేం అర్థం కావటం లేదు!'' అన్నాడు చాలా భయపడుతూ.

''బావుంది'' అనుకున్నాను. నిజమే! 'పర్సు వుంది' అని అతను అనగానే నాకూ కోపం వచ్చినట్టయింది. పాపం - అతను నాదగ్గరకొచ్చి ఆ విషయం చెప్పాడుగదా అని వెంటనే జాలి కలిగింది. ఇప్పుడితనిని ఏం చెయ్యాలి? పర్సు అతని దగ్గరే వున్నట్టు తెలిసిందా - కొంప మునిగిపోతుంది. ఇతనిమీద ఇహ జాలి తలచేవాడుండడు. పొరపాటువల్ల ఆ గాభరాలో సరిగ్గా చూసుకోలేదు! నేను ఆలోచించసాగాను.

''ఒక్కటి చెయ్యండి సార్'' అన్నాడు నెమ్మదిగా.

ఏమిటన్నట్టు చూశాను.

''పర్సు నెమ్మదిగా తీసి ఒక రూపాయి మీకిస్తాను. వాళ్ళిద్దరూ దొరకలేదని తిరిగి రాగానే ఓరూపాయి మిమ్మల్ని అడుగుతాను. మీకూ నాకూ ఏదో పరిచయం వున్నట్టుగా అడిగి, మళ్ళీ ఇచ్చేస్తానంటాను. ఆ రూపాయి నాకిచ్చేయండి. ఆ వుపకారం చేశారా - అంతా ఎప్పటిలాగా నామీద జాలిగా వుంటారు. వ్యవహారం కుదుట బడుతుంది. ఏమంటారు?'' అన్నాడు.

''సరే'' అన్నాను. ఆలోచన బాగానే వుంది. ఆ పర్సు ఇంకెక్కడో పడిపోయినట్టు అంతా అంటారు. పాపం అని సానుభూతి చూపిస్తారు. పైగా అతనికి ఆ సమయంలో నేను రూపాయి ఇవ్వటంవల్ల నామీదకూడా అందరికీ గౌరవ భావం ఏర్పడుతుంది.

ఆ కుర్రాడు దూరంగా చెట్టుచాటుగా పోయి, తిరిగి వచ్చి - నెమ్మదిగా నాచేతిలో రూపాయి వుంచాడు. మొహం మరింత దీనంగా వేలవేసి, ఆత్రుతగా వాళ్ల రాక కోసం ఎదురు చూడసాగాడు.

నేను నెమ్మదిగా లేచాను. ఐన ఆలస్యం ఐనా, వినోదభరితంగా వుందనిపించింది నాకు. నేనూ కుర్రాడూ రహస్యంగా మాట్లాడుకోటం ఎవరన్నా గమనించారేమోనని చూశాను. ఎవరూ గమనించినట్టు లేదు - ఎవరి గొడవల్లో వాళ్ళున్నారు.

ఇంతలో దూరంగా ఇద్దరూ వొస్తున్నట్టు కనిపించింది. అందరూ లేచి నించున్నారు. కండక్టరూ క్లీనరూ పరుగెత్తి వస్తున్నారు. ఆ కుర్రాడి మొహం చూశాను. ఇంకా దీనంగా, అమాయకంగా, ఆత్రుతగా వున్నట్టు కనిపించాడు!

అంతదూరం నుంచి కండక్టరు రొప్పుకుంటూ వస్తూ ''దొరికిందండోయ్ పర్సు దొరికింది'' అంటూ నవ్వుతూ చెయ్యెత్తి చూపించాడు. ఆ చేతిలో పర్సు ఒకటి తళతళా మెరుస్తూ కనిపించింది!! □